క్లుప్తంగా

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం

ఉయ్యాలవాడ : మండలంలో మార్చి 3వ తేదీన చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేద్దామని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో చిన్నారులను ఇంటింటికీ వెళ్లి గుర్తించాలన్నారు. ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద, 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న సురక్షతో పాటు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఎంపీహెచ్‌ఓలు దస్తగిరి, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్.జంబులదిన్నెలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయ స్వామి, శ్రీ లక్షబ్బువేంకటేశ్వరస్వామి వార్లకు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ, తదితర పూజలు చేశారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

గోస్పాడు: ఉద్యాన పంటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఏపీఓ నాగజ్యోతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి సిబ్బంది హార్టికల్చర్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు కలిగిన, లేని వారికి కూడా తోటలు సాగు చేసే అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పండ్లు, పూల తోటలను 5ఎకరాల్లోపు రైతులకు ఈ ప్రోత్సాహం వర్తిస్తుందని చెప్పారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు



చాంపియన్‌షిప్ విజేతగా నిలిచిన పశ్చిమగోదావరి జట్టు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక డాక్టర్ రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో 52వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయని నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మహబూబ్ బాషా, రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో పశ్చిమగోదావరి జట్టు స్వర్ణంతో చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కర్నూలు జట్టుకు రజతం, నంద్యాలకు కాంస్య పతకాలు దక్కాయన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, టోర్నమెంట్ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, లక్ష్మణ్, జాన్‌దత్తరావు, సురేష్ పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీవేంకటేశ్వరుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

చాగలమర్రి: లోక కల్యాణార్థం స్థానిక ముత్యాలపాడు బస్టాండ్ సమీపంలో ఎంపీపీ వీరభద్రుడు శనివారం భూదేవి, శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురుసి, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. వేద పండితులు బ్రహ్మ శ్రీ కైప వేంకటనరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, ఉమెన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీబాలవిద్య, సర్పంచ్ గోవిందయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉయ్యాలవాడ: మండలంలోని కాకరవాడ సమీపంలో శనివారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. పెద్దయమ్మనూరు, ఒంటెద్దుపల్లె, కాకరవాడ గ్రామానికి చెందిన వ్యక్తులు గ్రామ సమీపంలోని ఓ చెట్టు కింద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో దాడి చేసి అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.13,280 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

మంచి చేయడంతోనే ప్రజల ఆదరణ



చింతకుంటలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజల మధ్యనే ఉంటూ.. సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం. అభివృద్ధి పనులు చేపడుతున్నాం. జగనన్న ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో తమకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని, తాము కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చిపోయే వాళ్లం కాదని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటి పరిధిలో వివిధ కాలనీల్లో రూ.2.29 కోట్లతో నిర్మాణం చేపట్టిన 17 సీసీ రోడ్లను శనివారం ప్రారంభించారు. బుడగజంగాల కాలనీలో రూ. 25.5 లక్షలతో నిర్మించిన, రూ.14 లక్షలతో ఏసునాథపురం, రూ.11 లక్షలతో పిచింతకుంట సుంకులమ్మ కాలనీ, రూ.10 లక్షలతో చింతకుంట గడబావి కాలనీ, రూ.16 లక్షలతో ఎంపీ నగర్, రూ.3 లక్షలతో లక్ష్మిరెడ్డి వీధి, రూ.33 లక్షలతో సుంకులమ్మ కాలనీ, రూ.23 లక్షలతో బాలాజీ నగర్, రూ.10 లక్షలతో రామాలయం వీధి, రూ.22 లక్షలతో అమ్మవారిశాల నుంచి బాలికల పాఠశాల వరకు, రూ.13 లక్షలతో ఆశ్రమం వీధి, రూ.10 లక్షలతో ఆశ్రమం వీధి రెండో లైన్, రూ.7 లక్షలతో ఆశ్రమం వీధి మూడో లైన్, రూ.9 లక్షలతో ఆశ్రమం వీధి, రూ.30 లక్షలతో కందుకూరు రోడ్‌లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. మరోసారి జగనన్న సీఎంగా గెలిపించుకుంటే ఇవన్నీ కొనసాగుతాయన్నారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, కమిషనర్ రమేష్‌బాబు, ఏఈ సురేంద్ర, కౌన్సిలర్లు ఆజాద్, బాలబ్బి, నరసింహుడు, గురుమూర్తి, సుధాకర్‌రెడ్డి, రత్నాకర్ వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు శివనాగిరెడ్డి, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కాంట్రాక్టర్లు గోపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నజీర్ ఉన్నారు.



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కనుల పండువగా బోనాల సమర్పణ



వెండిచీర అలంకరణలో జంబులాపరమేశ్వరి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కుందూనది ఒడ్డున వెలసిన శ్రీజంబులాపరమేశ్వరిదేవి బోనాల మహోత్సవంలో భాగంగా రెండవ రోజు శనివారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పట్టణానికి చెందిన మహిళలు ప్రత్యేక పాత్రలో అమ్మవారికి ప్రీతికరమైన పరమాన్నం, పులగంను ఒండి తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పూజలు చేసి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా సాయంత్రం మధ్యాహ్నం దాటినా పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు బోనాలతో వస్తుండటంతో దారులు కిటకిటలాడాయి. అంతకు ముందు అమ్మవారిని ఆలయ పండితులు వెండి చీర అలంకరించారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేపట్టారు.



షెట్టర్ రాడ్డు లేని 23వ బ్లాక్ తూము



తెలుగుగంగ ప్రధాన కాల్వలో పడి ఉన్న షెట్టర్ రాడ్డు

తెగించిన స్వార్థం

- తెలుగుగంగ కాల్వ అడ్డుకట్టకు గండి
- 23వ బ్లాక్ తూము షట్టర్ ధ్వంసం
- షట్టర్ రాడ్డు తొలగించి కాల్వలో పడేసిన వైనం
- కాల్వల ద్వారా అక్రమంగా నీటి తరలింపు



అడ్డుకట్టకు గండికొట్టడంతో 22వ బ్లాక్ నుంచి పారుతున్న నీరు

రుద్రవరం: కొందరి స్వార్థం కారణంగా తెలుగుగంగ కాల్వ కట్టడాలు, పరికరాలను ధ్వంసమయ్యాయి. ఆయకట్టు రైతుల బాగు కోసం ఇటీవల ప్రభుత్వం లక్షలాది రూపాయలను వెచ్చించి తెలుగుగంగ కాల్వకు మరమ్మతు పనులు చేయించింది. అయితే చేసిన కొద్ది నెలలకే వాటిని పగుల గొట్టారు. మండల కేంద్రం రుద్రవరానికి సమీపంలోనున్న గండ్లేరు (తుండ్లవాగు) రిజర్వాయర్ వద్ద చోటు చేసుకుంది. మూడు దశాబ్దాల క్రితం తెలుగు గంగ కాల్వలు తవ్వారు. వాటి మరమ్మతులపై ఏ ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో ప్రధాన కాల్వ కట్టలు దెబ్బతిని లీకేజీలు,సైడ్ వాల్స్ కూలడం వంటివి చోటు చేసుకొని దిగువకు నీరు పారక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తెలుగుగంగ కాల్వలను బాగు చేసేందుకు నిధులు విడుదల చేసింది. కొద్ది నెలల క్రితం కాంట్రాక్టర్లు రిజర్వాయరులో నుంచి నీరు వెనక్కు రాకుండ అడ్డుకట్ట నిర్మించారు. అలాగే దెబ్బతిన్న 22,23 బ్లాక్ తూములకు మరమ్మతులు చేయించారు. దీంతో దిగువకు సాగు నీరు సవ్యంగా పారేది. అయితే అధికారులు వద్దని చెప్పిన వినకుండా కొందరు రైతులు నీటి ఆధారిత పంటలు సాగు చేశారు. ప్రస్తుతం వాటికి నీటి తడులు అవసరం కావడంతో కట్టడాలను ధ్వంసం చేసి గండి ద్వారా, గాలి పైపుల ద్వారా రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తున్నారు. అలాగే తూముల షెట్టర్‌లను ధ్వంసం చేశారు. అక్కడితో ఆగకుండా..షెట్టర్ రాడ్డును తొలగించి దూరంగా నీటిలో పడేశారు.

పోలింగ్ కేంద్రాలకు నంబర్లు



పోలింగ్ కేంద్రాల వద్ద వివరాలు రాసిన దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని 24 పోలింగ్ కేంద్రాలకు పీఎస్ నంబర్లు వేయించినట్లు తహసీల్దార్ నాగరాజు శనివారం తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నంబర్‌తో పాటు బీఎల్‌ఓ, తహసీల్దార్, వీఆర్‌ఓ ఫోన్ నంబర్లను కూడా రాసినట్లు చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే ఫోన్ చేసేందుకు వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించామని, దివ్యాంగుల కోసం ర్యాంపులు కూడా ఉన్నాయని చెప్పారు.

జంబులమ్మకు ప్రత్యేక పూజలు



రుద్రవరంలో జంబులమ్మ ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రుద్రవరం: స్థానికంగా వెలసిన జంబులమ్మ అమ్మవారికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మాఘ పౌర్ణమిని సందర్భంగా రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ నిర్వాహకులు అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా గ్రామ శివారులోని ఆలయం వరకు తీసుకెళ్లి కొలువు దీర్చారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి తిరిగి ఆలయంలో కొలువుదీర్చారు.

కొండెక్కిన నరసింహస్వామి మాలధారులు



రుద్రవరం నుంచి కాలి బాటన అహోబిలానికి వెళ్తున్న మాలధారులు

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి నరసింహస్వామి మాలధారులు శనివారం ఎగువ అహోబిలం చేరుకున్నారు. గత నెల16 మకర సంక్రాంతి తరువాత ఉత్సవమూర్తులు పార్వేటకు బయలుదేరిన రోజు వేలాది మంది నరసింహ స్వామి మాల స్వీకరించి, మండల దీక్ష బూనారు. గడువు ముగియడంతో మాలాధారులంతా దీక్ష విరమించేందుకు కాలి బాటన అహోబిలం బయలుదేరారు.

మల్లన్నను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న న్యాయమూర్తి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం ఆలయం వద్ద కు విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు అలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి. పెద్ది రాజు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామి వారిని, భ్రమరాంబా దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఘనంగా ప్రింటర్స్ డే

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలో ప్రింటర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాళికాంబ ఆలయంలో సమావేశం నిర్వహించి జాన్ గూటెన్‌బర్గ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహానంది సూపరింటెండెంట్‌కు పదోన్నతి

మహానంది: దేవస్థానం సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడుకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఈఓ కాపు చంద్ర శేఖర్ రెడ్డి ఆయనకు ఉత్తర్వులను అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన ఉపేంద్ర

దొర్నిపాడు: మండల కేంద్రానికి చెందిన బోయ ఉపేంద్ర (29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఏఎస్ఐ మౌలాలి శనివారం తెలిపారు. వివరాలు.. ఉపేంద్ర తన బంధువులను వదిలిరావడానికి కారులో ఆళ్లగడ్డకు బయలు దేరారు. తిరుగుప్రయాణంలో భాగ్యనగరం సమీపంలోకి రాగానే పాడిగేదె అడ్డురావడంతో తప్పించ బోయి తాటిచెట్టుకు ఢీ కొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఉశేని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

ఆలయాభివృద్ధికి విరాళం



దాతలను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి అమ్మవార్లకు శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఇందులో భాగంగా నంద్యాలకు చెందిన అశ్వత్ కుమార్ చౌదరి,శోభారాణి దంపతులు ఆలయాభివృద్ధికి రూ.1,11,114 విరాళంగా ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి, రంగనాయకులు, నరసింహులుకు అందజేశారు. దీంతో వారు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు,జ్ఞాపిక అందజేశారు.

వన్య ప్రాణుల సంరక్షణకు టీకాలు



పశువుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం: అడవుల్లో ఉండే వన్యప్రాణుల సంరక్షణ కోసం గ్రామాల్లోని పశువులకు టీకాలు వేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఆలమూరు గ్రామంలో అటవీ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని జీవాల వల్ల వన్యప్రాణులకు వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు బర్రెలు, ఆవులు, గొర్రెలు, మేకలకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. అనంతరం రైతులకు మందులను అందించారు. సర్పంచ్ ముల్లా మహ్మద్‌షరీఫ్, డీఆర్ఓ చంద్రహాస్, పశుసంవర్ధకశాఖ ఏడీ కమలాకర్, వైద్యురాలు సులోచన, ఎఫ్‌బీఓ జమాల్‌వలి, మహేష్, అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వెలుగోడు: రైతులు పండించిన జొన్నను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం రేగడగూడురు గ్రామంలోని ఆర్‌బీకే వద్ద జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జొన్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. జొన్న క్వింటాల్ బయట మార్కెట్‌లో రూ.2,600 ఉండగా ప్రభుత్వం రూ.3,180 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మీ రెడ్డి, జయరామిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

మహానంది: అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తామామలు వేధిస్తుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. గాజులపల్లె గ్రామానికి చెందిన కొండెపోగు జాస్లీన్‌కు ఎమ్మిగనూరుకు చెందిన కమల్‌కుమార్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. అయితే ఇటీవల భర్త కమల్‌కుమార్‌తో పాటు అత్త, మామ, భర్త అక్క అదనపు కట్నం కోసం నిత్యం వేధిస్తున్నారని, మానసికంగా బాధపెడుతున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందన్నారు.

నివాళి

నంద్యాల టౌన్: ఐఎంఏ సీనియర్ సభ్యుడు, నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ సంస్మరణ సభ నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మధుమణి సమావేశ భవనంలో నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ వసుధా రాణి అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర మాజీ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ చంద్రశేఖర్ రెండు దశాబ్దాలుగా తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా, నంద్యాల జిల్లా క్షయ వ్యాధి కేంద్రం వైద్యాధికారిగా, ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, నంద్యాల ఐఎంఏ కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా ఉత్తమ సేవలందించారని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్యులు వసుధ ,మధుసూదన్ రెడ్డి, జ్రప్రుళ్ల, సహదేవుడు, విజయ్ భాస్కర్ రెడ్డి, రాజ శేఖర్ పాల్గొన్నారు.

29న వీహెచ్‌పీఎస్ సమావేశం

నంద్యాల(అర్బన్): ఈనెల 29వ తేదీన స్థానిక నిశాంత్‌భవన్‌లో వీహెచ్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.6వేలకు, ఉచిత బస్సు ప్రయాణం, అంత్యోదయ కార్డుల మంజూరు, పూచీకత్తు లేకుండా రూ.5లక్షల వరకు రుణాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర వాటిపై సమావేశంలో చర్చించనున్నామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని చెప్పారు.

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ మాదిగలను మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి జైకిసాన్ పార్కు వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాన్షీరామ్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన విస్తృస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలను నమ్మించి నట్టేట ముంచేసిన పార్టీ బీజేపీయేనన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఉధృత పోరుబాట తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, జిల్లాల నాయకులు లింగాల స్వాములు, పులికొండ, స్థానిక నాయకులు నాగరాజు, రమణ, సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): యువకులు చదువుల రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. ప్రజా ఉద్యమ నేత, పోరాటయోధుడు చదువుల రామయ్య 32వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన వర్ధంతి సభలో పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ మట్లాడుతూ కర్నూలు జిల్లాలోని మరెళ్ల గ్రామానికి చెందిన ధనిక రైతు కుటుంబం చదువుల అనుమప్ప, నాగమ్మ దంపతులకు చదువుల రామయ్య జన్మించాడని, కమ్యూనిస్ట్ ఉద్యమాలకు ఆకర్షితులైన స్వాతంత్ర్య పోరాటాల్లో భాగంగా పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేశారు. ఆయన పోరాడి133 ఎకరాలు సీలింగ్ భూమిని పేదలకు పంపిణీ చేయించారన్నారు. సంజీవులు, సోమన్న, శ్రీనివాసులు, రాముడు, మద్దిలేటి, రంగయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈనెల 28వ తేదీన కర్నూలుకు రానున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీ మాదిగ, బుడగజంగం జాతీయ నాయకులు నారాయణ మాదిగ కోరారు. పర్యటనకు సంబంధించిన గోడపత్రికలను శనివారం స్థానిక నిశాంత్‌భవన్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అన్ని సంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరసింహులు మాదిగ, ఓబులేసు మాదిగ, శివనారాయణ మాదిగ పాల్గొన్నారు.

రెవెన్యూ క్వార్టర్స్ పాత భవనాల కూల్చివేత





పాత రెవెన్యూ సముదాయాలను కూల్చివేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 15వ వార్డులో నున్న రెవెన్యూ క్వార్టర్స్ పాత భవనాలను కూల్చివేశారు. పాడుబడిన పాత భవనాలతో దుర్వాసన, విషపురుగులు వస్తుండటం, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయని స్థానికులు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులతో చర్చించి భవనాలను కూల్చివేయాలని స్థానిక వార్డు ఇన్‌చార్జ్ సాయిరాంరెడ్డిని ఆదేశించారు. ఆయన పాత భవనాలను యంత్రాల ద్వారా కూల్చివేయించారు.

జొన్నకు మద్దతు ధర



సర్వాయిపల్లెలో జొన్న రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయధికారి

ఉయ్యాలవాడ : జొన్నలను ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతుల నుంచి మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శనివారం మండలంలోని సర్వాయిపల్లె, ఇంజేడు గ్రామాల్లో జొన్న పంట సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్‌లో జొన్న ధర క్వింటా రూ. 2,600 మాత్రమే ఉండగా ప్రభుత్వం హైబ్రిడ్ జొన్న రకాలను కనీస మద్దతు ధర రూ.3,180, మహేంద్ర రకం క్వింటా రూ. 3,225 ప్రకారం కొనుగోలు చేస్తుందని చెప్పారు. మండలంలో జొన్న సాగు చేసిన రైతుల పంటలు ఈ క్రాప్ నమోదుతో పాటు ఈ కేవైసీ చేయించామన్నారు. రైతుల నుంచి ఇప్పటికే 1,500 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసేందుకు ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ సిబ్బంది జొన్నలను పరిశీలించారని, నాణ్యత కలిగిన వాటిని వెంటనే కొనుగోలు చేస్తామన్నారు.